తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-04-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:128 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


# కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు కీలకం: కిషన్‌రెడ్డి



- ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోంది
- వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి ఆలోచిస్తున్నారు
- కాలం చెల్లిన చట్టాలను ప్రధాని మోదీ రద్దు చేశారు: ఎంపీ లక్ష్మణ్
- న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు రావాలి : రాంచందర్ రావు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇవాళ (శుక్రవారం) హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కే.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు.

మిగతా 2లో..



## దామోదర్ రెడ్డి భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళి

- రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్ రెడ్డి మృతి
- జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం భౌతికకాయం
- రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకుల నివాళులు

2లో

## ఫుల్ కిక్కే కిక్కు..

### రికార్డ్ స్థాయిలో మద్యం అమ్మకాలు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.

మిగతా 2లో..

## ఏడాదిన్నరలోపే గ్రూప్ 1, 2 నియామకాలు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా కేవలం ఏడాదిన్నరలోపే గ్రూప్ 1, 2 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. టీజీపీఎస్సీ వ్యూహాత్మకంగా ముందుకెళ్లి వేగంగా నియామకాలను పూర్తి చేసింది. ఈ పోస్టులకు 1:1 నిష్పత్తిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టడంతోపాటు గ్రూప్ 1లో తొలిసారి అభ్యర్థులు పొందిన మార్కులను వ్యక్తిగత లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. పైగా రీకౌంటింగ్‌కు కూడా అవకాశం ఇచ్చింది.

మిగతా 2లో..



## దత్తాత్రేయ అంటే తెలంగాణ వ్యక్తిత్వం కలిగిన గొప్ప వ్యక్తి : కవిత

- 20 ఏళ్లుగా కుల, మతాలకు అతీతంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారన్న కవిత
- దత్తన్న వద్దకు ఏదైనా పని కోసం వెళితే కచ్చితంగా పరిష్కారమయ్యేదని వ్యాఖ్య

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

బండారు దత్తాత్రేయ అంటే బీజేపీ నాయకుడిగానో, గవర్నర్‌గానో కాకుండా పది మందిని కలుపుకుని పోయే తెలంగాణ వ్యక్తిత్వం కలిగిన గొప్ప వ్యక్తి అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్‌బలయ్' కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ, 20 ఏళ్లుగా దత్తాత్రేయ రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.

మిగతా 2లో..

## తెలంగాణకు వస్తా ...

# రేవంత్ రెడ్డిని ఓడిస్తా

### ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి వార్నింగ్



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

జనస్వరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌ను ఓడిస్తామని, రాహుల్ గాంధీ కాదు, ఆయన్ను ఎవరూ రక్షించలేరని ప్రశాంత్ కిషోర్ అన్నారు. బీహారీలను తక్కువ చేసి మాట్లాడిన రేవంత్‌కు గుణపాఠం చెబుతామన్నారు. టైమ్స్ నౌకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఈ ఏడాది చివరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రశాంత్ కిషోర్.. బీహారీలను ఉద్దేశిస్తూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బీహారీలను కించపరుస్తూ రేవంత్ చేసిన వ్యాఖ్యలను కిశోర్ తప్పుపట్టారు. భగవంతుడు టైం ఇచ్చాడని, వాళ్ల లెక్క సరి చేస్తామన్నారు. బీహారీ ప్రజలను తిట్టే వ్యక్తికి సలహాలు ఇవ్వబోమని, వాళ్ల లెక్కను తర్వాత సెటిల్ చేస్తామన్నారు. తమ పార్టీని గెలిపించాలని కోరుతూ రేవంత్ రెడ్డి మూడుసార్లు తనను కలిసినట్లు ప్రశాంత్ కిషోర్ గుర్తు చేశారు. కానీ తామేమీ సాయం చేయలేదన్నారు. తొలిసారి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి .. బీహార్ ప్రజలను హేళన చేసే విధంగా మాట్లాడినట్లు తెలిపారు. బీహార్ ప్రజల డీఎన్ఏ.. తెలంగాణ ప్రజల డీఎన్ఏ కన్నా తక్కువ అని రేవంత్ పేర్కొనడాన్ని ఆయన తప్పుపట్టారు. బీహారీల డీఎన్ఏ ఖరాబైందన్న రేవంత్‌కు వచ్చే ఎన్నికల్లో తెలుస్తుందని, ఎవరి దిమాక్ ఖరాబైందో అప్పుడు చూపిస్తామని ప్రశాంత్ కిషోర్ అన్నారు.

మిగతా 2లో..

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

### ప్రధానంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గ్యాంగుల ఆటకట్టిస్తున్నారు పోలీసులు




(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గ్యాంగుల ఆటకట్టిస్తున్నారు పోలీసులు. నైజీరియా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో సప్లై చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరోజుల క్రితం గ్రీండర్ అనే గే డేటింగ్ యాప్ ద్వారా నైజీరియాకు చెందిన వ్యక్తి జియోఫ్రీ.. హైదరాబాద్‌లో డ్రగ్స్ సప్లై చేశాడు.

మిగతా 2లో..



## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఫుల్ కిక్కే కిక్కు..

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడిరచారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి. అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడిరది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడిరచింది.





# కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు కీలకం: కిషన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలి అంటే అందరం కలిసి కట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు కిషన్‌రెడ్డి. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కే.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్చిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో మోదీ దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో నిప్పుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఫైర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడిరచారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరిత గతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# ఏడాదిన్నరలోపే గ్రూప్ 1, 2 నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పూర్తి చేసిన తొలి గ్రూప్ పోస్టులు కూడా ఇవే కావడం విశేషం. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో నోటిఫికేషన్ వెలువడిరది. అప్పట్లో ఈ నియామక ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగి 2017లో ముగిసింది. దాదాపు ఆరున్నరేళ్లకుపైగా నియామక ప్రక్రియ కొనసాగింది. అప్పట్లో కూడా న్యాయవివాదాల కారణంగా 2 సార్లు రాతపరీక్షలు జరిగాయి. ఇందులో తెలంగాణలో 121 మంది ఎంపికయ్యారు. 2024 ఫిబ్రవరిలో 563 పోస్టులతో టీజీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చింది. ఇంత పెద్ద స్థాయిలో గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం కూడా ఇదే తొలిసారి. ఆ తర్వాత 4 నెలల్లోనే అంటే జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించి, జులై 7న ఫలితాలు వెల్లడిరచింది. ప్రిలిమ్స్‌లో 31,382 మంది అర్హత సాధించడంతో వారందరికీ మెయిన్స్ పరీక్షలు 2024 అక్టోబరు 21 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలో అభ్యర్థుల మార్కులను ఈ ఏడాది మార్చి 10న వెల్లడిరచింది. అనంతరం 1:1 నిష్పత్తిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసింది. తుది ఫలితాలు వెల్లడిరచే సమయానికి న్యాయ వివాదాలు చుట్టుముట్టాయి. దీంతో సెప్టెంబర్ నెలాఖరులో గ్రూప్ 1 తుది ఫలితాలు వెలువడ్డాయి. కేవలం 19 నెలల్లో ఈ నియామకాలు పూర్తి చేయడాన్ని టీజీపీఎస్సీ రికార్డుగా పేర్కొంది. అలాగే గ్రూప్ 2 తుది ఫలితాలను కూడా టీజీపీఎస్సీ వేగంగా ప్రకటించింది. రాతపరీక్ష జరిగిన ఏడాదిలోగా తుది ఫలితాలు వెల్లడయ్యాయి. గతంలో గ్రూప్ 2 తుది ఫలితాలు వెల్లడిరచడానికి మూడేళ్లు పట్టింది.





# దత్తాత్రేయ అంటే తెలంగాణ వ్యక్తిత్వం కలిగిన గొప్ప వ్యక్తి : కవిత

(మొదటి పేజీ తరువాయి)

దత్తాత్రేయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆయన కుమార్తె విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. తాను రాజకీయాల్లో ఎదుగుతున్న క్రమంలో దత్తాత్రేయ గురించి చాలామంది తనకు చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఏదైనా పని కోసం దత్తన్న వద్దకు వెళితే వారి సమస్య కచ్చితంగా పరిష్కారమయ్యేదని అన్నారు. పండుగ అంటేనే పదిమంది కలవడమని, పండుగ అంటే పదిమందితో ఆనందాన్ని పంచుకోవడమని కవిత అన్నారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే ఇలాంటి వేదికను ఇరవై సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారని కవిత అన్నారు. విజయలక్ష్మి కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ఆ వ్యక్తి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. భాగ్యనగరానికి డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నాడు.. ఎవరెవరికి ఇస్తున్నాడనే సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు టీమ్ ను ఏర్పాటు చేశారు ఉన్నతాధికారులు. అనంతరం నిందితుడిని పట్టుకుని ఆట కట్టించారు హైదరాబాద్ పోలీసులు. అయితే, సదరు వ్యక్తి 2019లో ఫేక్ పాస్‌పోర్ట్‌తో ఐవరీ కోస్ట్ నుంచి నేపాల్‌లోకి ప్రవేశించాడు. అక్కడి నుంచి ఇండియాకు వచ్చాడు. ఢల్లీ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్, బెంగుళూరులో సప్లై చేస్తున్నాడు సదరు నైజీరియన్. ఈ క్రమంలో ఆ వ్యక్తిని పట్టుకున్న పోలీసులు హైదరాబాద్ నుంచి తన సొంత దేశమైనా నైజీరియాకు పంపించారు. డ్రగ్స్ అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ జోలికెళ్లి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణకు వస్తా ...
# రేవంత్ రెడ్డిని ఓడిస్తా

(మొదటి పేజీ తరువాయి)

మేం ఎవరికీ భయపడం అని, రాహుల్ గాంధీ కాదు కదా, ఎవరికీ భయపడమన్నారు. బీహారీ ప్రజలను తిట్టే వ్యక్తులకు బుద్ధి చెబుతామన్నారు. శక్తినంతా వాడి రేవంత్‌ను ఓడిస్తానన్నారు. రాహుల్ గాంధీ కూడా రేవంత్‌ను కాపాడలేరన్నారు. బీహార్ ప్రజలను నిందించి, రాజనీతి చేస్తావా అని ప్రశ్నించారు. మేం ఎవరినైనా తిట్టామా అని ప్రశాంత్ అడిగారు. తెలంగాణకు వచ్చి మిమ్మల్ని ఓడిస్తామన్నారు. తెలంగాణ ప్రజల కన్నా బీహారీల డీఎన్‌ఏ తక్కువ అయితే, మరి మీరెందుకు వచ్చి సలహాలు తీసుకున్నారని రేవంత్‌ను ఆయన ప్రశ్నించారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. “అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి” అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఎంపీ రఘురాం రెడ్డి కృషితో.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉందని.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పార్లమెంట్ లో చర్చించి, మంజూరు చేయాల్సిందిగా.. గతంలో కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో..తాజాగా కేంద్రం స్పందించి మంజూరు చేసింది. కొత్తగా తెలంగాణ రాష్ట్రానికి.. నాలుగు కేటాయించగా.. అందులో ఒకటి భద్రాద్రి జిల్లాకు దక్కింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలప్పుడు.. ఆదివాసీ బిడ్డల విద్యాభివృద్ధి కోసం కేంద్రం చొరవ చూపాల్సిన అవసరం ఉందని.. ఈ మేరకు ముందుకు రావాలని కోరగా చేసిన అభ్యర్థనలు ఫలించాయి.



ఎంపీ రఘురాంరెడ్డి చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరవడం పట్ల.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ నేతలు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

# దామోదర్ రెడ్డి భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళి

**(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి భౌతిక కాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం దామోదర్ రెడ్డి మృతి చెందారు. ఈరోజు ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతిక కాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా నివాళులర్పించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై




అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఆయనకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, కోలుకుని తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటారని తాము భావించామని అన్నారు. ఆయన మృతి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు.

# వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం!

సామాన్యులకు మరోసారి ఆర్బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఈరోజు జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు యథాతథంగా ఉంచుతూ ప్రజలకు తీపి కబురు అందించింది. కాగా రెపో రేటు 5.5 శాతం యథాతథంగా ఉండనుంది. అయితే ఆర్బీఐ రేపో రేటులను స్థిరంగా ఉంచండం ఇది రెండో సారి. అయితే.. తాజా ఆర్బీఐ ప్రకటనతో మనం కట్టే ఈఎంఐలలో ఎలాంటి మార్పులు ఉండవు.

ఇటీవల తగ్గింపు...

దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే దిశగా ఆర్బీఐ అడుగులు వేస్తోంది. అయితే ఇటీవల అతర్జాతీయంతో పాటు మన దేశంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణాలతో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో రేపో రేట్లను 0.25 శాతం చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న




సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఆర్బీఐ ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కాగా ఇలా వరుసగా మూడు కీలక సమావేశాల్లో ఆర్బీఐ.. రేపో రేటును 1 శాతం మేర తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై విధించిన పన్నుల భారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు నెలలో రేపో రేటు మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే అక్టోబర్ నెలలో కూడా రేపో రేటును యథాతథంగా ఉంచుతూ ప్రకటన విడుదల

# బేతుపల్లి గౌడ బజార్‌లో దసరా-నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా.!

**సత్తుపల్లి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**




బేతుపల్లి గ్రామంలో గౌడ బజార్‌లో ఈసారి దసరా, నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంతో ఘనంగా జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు, స్థానికులు ఉత్సవ వేదికల వద్ద పెద్ద ఎత్తున చేరి, సాంప్రదాయానికి తగ్గట్లుగా ఉత్సవ వాతావరణాన్ని సృష్టించారు.
నవరాత్రి సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, దీపారాధనలు, హోమాలు నిర్వహించబడ్డాయి. మహిళలు, యువతులు సంప్రదాయ నృత్యాలు, భక్తిగీతాలతో ఉత్సవాన్ని మరింత హర్షభరితంగా తీర్చిద్దారు. గౌడ బజార్ మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. వీధి లో భక్తుల కూర్చునే ప్రదేశం ఉత్సవ కళాసౌభాగ్యాన్ని ప్రతిబింబించింది. ప్రధాన ఆకర్షణలలో ప్రత్యేక సాంప్రదాయ ప్రదర్శనలు, సంగీతం, ఆటలు, చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన వినోద వేదికలు, ఊరెలో ఉత్సాహభరిత రాత్రులను పండించారు. స్థానిక యువతీ యువకులు నిర్వహణలో భక్తి మరియు సాంస్కృతిక విలువలను ప్రేరేపించేందుకు ముఖ్య భూమిక పోషించారు.
ఈ ఉత్సవాల ద్వారా బేతుపల్లి గౌడ బజార్ కేవలం భక్తి కేంద్రంగా మాత్రమే కాకుండా, స్థానిక సాంస్కృతిక సంప్రదాయాల కలిసికట్టుగా నిలిచే కేంద్రంగా కూడా మారింది. ఉత్సవాన్ని అనుభవించిన భక్తులు, స్థానికులు బేతుపల్లి గౌడ బజార్‌లో ఇంత వైభవంగా, సంప్రదాయభరితంగా ఉత్సవాలు జరగడం ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన సరస్వతి పుత్రుడు గణేష్‌కి ఆర్థిక కష్టాలు

- ఈ నెల 6వ తేదీవరకు 1,50,000 రూ.ల ట్యూషన్,కాలేజీ ఫీజు చెల్లించాలి
- ట్యూషన్ ఫీజు కట్టలేని స్థితిలో గణేష్
- దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి
- చిన్నతనంలోనే తల్లిదండ్రులను,తో బుట్టువును సైతం కోల్పోయిన గణేష్
- అమ్మమ్మ ఇంట్లో పెరిగారు
- గవర్నమెంట్ స్కూల్,కాలేజీలోనే పూర్తి విద్యాభ్యాసం
- ఎటువంటి కోచింగ్ లేకుండానే మెడికల్ సీటు సాధించిన గణేష్





**వరంగల్,అక్టోబర్3(తెలంగాణ ముచ్చట్లు):**

ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించిన వరంగల్ ఎనుమాములకు చెందిన సరస్వతి పుత్రుడు గణేష్ ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్నాడు.
మన సమాజంలో ఉన్న ప్రతిభావంతులలో ఒకడైన గణేష్ జీవితమంతా పోరాటమే. దళిత సామాజిక వర్గానికి చెందిన ఈ విద్యార్థి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారాడు. అయినా తన దారిని తానే సృష్టించుకున్నాడు. గవర్నమెంట్ స్కూల్‌లో చదివి, గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేసి, ఎటువంటి కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా కేవలం తన కష్టంతో, పట్టుదలతో మెడికల్ (ఎంబీబీఎస్) సీటు సాధించాడు.
అయితే ఇప్పుడు అతని కలలు ఛిద్రమయ్యే పరిస్థితి నెలకొంది. కాలేజీ ఫీజు రూపంలో ఈ నెల 6వ తేదీ లోపు ₹1,50,000 చెల్లించకపోతే గణేష్ సాధించిన సీటు రద్దు కానుంది. తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థికి ఈ భారీ మొత్తం చెల్లించడం అసాధ్యం. ఈ పరిస్థితిలో గణేష్ భవిష్యత్తును కాపాడటం మన సమాజ బాధ్యత. ఈ ప్రతిభావంతుడు వైద్యుడిగా మారి రేపు పేదలకు సేవలు అందించగలడనే ఆశతో దాతలు ముందుకు దయచూపి సహాయం చేయగలరని మనవి. మీరు స్వయంగా సహాయం చేయలేకపోయినా,మీకు తెలిసిన దాతలకు ఈ వివరాలను(గణేష్ కాంటాక్ట్ నెంబర్: 8074016811) తెలియజేసి,ఈ విద్యార్థి కల నెరవేర్చేలా చేయండి.గణేష్ కలల వైద్యవృత్తిని కాపాడటానికి మీ చిన్న సహాయం కూడా గొప్పదే.



# స్థానిక ఎన్నికలపై బిజెపి పార్టీ ఆఫీసులో మండల సమావేశం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:**

శుక్రవారం రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లు దృష్టిలో పెట్టుకొని బీజేపీ మండల పార్టీ ఆఫీసులో మండల అధ్యక్షులు కొండా గోపి ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ మరియు గ్రామ పంచాయతీ, వార్డ్ నెంబర్స్ గా స్థానాలలో పోటీ చేయాలని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మద్దినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య, అధ్యక్షులు బక్క సత్తిమూర్తి,మాజి అధ్యక్షులు ఆలస్యం వీరప్రసాద్, సిహెచ్ కృష్ణా,నాయకులు కోరిపెల్లి శ్రీను, అనగాని రామారావు, చెన్నూరి నాగచారి, షేక్ సిద్దుమియా, కోట సికిందర్,నరసింశెట్టి కృష్ణా య్య, చింతలా తతారావు,సిధార్ధ, హేమంత్, బల్లి పిచ్చ రావు, దేశాన్ని గోపాలరావు,శ్రీనివాసరెడ్డి, వేముల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ దయతోనే సర్వం సుభిక్షం

- మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి
- భూదాన్ పోచంపల్లి మండలం ఘనంగా దేవి నిమజ్జనం

**భువనగిరి,అక్టోబర్3(తెలంగాణ ముచ్చట్లు):**

అమ్మ దయతోనే ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి కోరుకున్నారు. భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో దేవి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ శోభయాత్ర లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవం ర్యాలీని ప్రారంభించిన్నట్లు చెప్పారు. బతుకమ్మ ఆటపాటతో అలరించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మ ఆటపాట ను కొనసాగించారు. ఈ శోభయాత్ర లో ఈరటి మహేష్, బూరుగు పరమేశ్, తడ్కపల్లి ప్రవీణ్ రెడ్డి చేరుపల్లి శేఖర్ రెడ్డి, కల్కురీ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.







# పెద్దపెండ్యాలలో ఘనంగా దసరా వేడుకలు

**పెద్దపెండ్యాల,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో దసరా పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా గ్రామస్తులు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి, గ్రామ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను భక్తి శ్రద్ధలతో జరిపారు.సాంప్రదాయం ప్రకారం విజయదశమి రోజున జమ్మి చెట్టుకు పూజలు చేయడం శుభప్రదమని విశ్వసిస్తారు. జమ్మి ఆకులను "సువర్ణం"గా భావించి ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. విజయం, ఐశ్వర్యం, శుభఫలితాలకు సూచికగా భావించే ఈ ఆచారాన్ని గ్రామస్తులు ఎంతో భక్తితో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి,నాయకులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దమ్మాయిగూడలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగింపు

**దమ్మాయిగూడ,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శివానందపూర్ కాలనీలో పదకొండు రోజులపాటు నిర్వహించిన శ్రీ కనకదుర్గాదేవి దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి.
ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అమ్మవారి శోభాయమాన అలంకరణలు, శక్తి తాండవాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాలు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా సాగి విజయదశమి రోజున ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ కమిటీ చైర్మన్ సుప్రీత్ రెడ్డి (సినీనటుడు కాట్రాజ్), అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కమిటీ సభ్యుల సమిష్టి సహకారంతో వేడుకలు మరింత భక్తిపరంగా, ఆధ్యాత్మికంగా జరిగాయి.
విజయదశమి సందర్భంగా ఉరేగింపు, చక్రస్నానం, మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించగా, అనంతరం భక్తులందరికీ మహాప్రాసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల ముగింపునకు వందలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారి ఆశీర్వాదాలను పొందారు.





# పేదరికాన్ని జయించి నిడిగొండ రూప శ్రీకి ఎంబీబీఎస్ సీటు!

**ఖమ్మం బ్యూరో చీఫ్, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;**

ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం, ఈర్లపూడి గ్రామంకు చెందిన నిడిగొండ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, వసంతల పుత్రిక, నిడిగొండ రూప శ్రీ, వైద్య విద్య ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటును సాధించింది. మైనారిటీ గురుకుల కళాశాలలో విద్యనభ్యసించిన రూప శ్రీ, కష్టపడి చదివి, 9878 ర్యాంకుతో వరంగల్ ప్రతిమ మెడికల్ కాలేజ్లో ఎంబీబీఎస్ సీటును దక్కించుకుంది. అత్యంత నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ విజయాన్ని సాధించడం విశేషం. ఆమె తండ్రి వెంకటేశ్వర్లు బార్బర్ వృత్తిని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.
పేదరికం ఆమె లక్ష్యాన్ని అడ్డుకోలేకపోయింది. భవిష్యత్తులో డాక్టర్‌గా ప్రజలందరికీ వైద్య సేవలు అందించాలనే ఆమె సంకల్పం నెరవేరాలని వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు మరియు ప్రత్యేకంగా అడ్వకేట్ ధరావత్ ప్రసాద్, ఈర్లపూడి గ్రామస్తులు మనసారా కోరుకుంటున్నారు. మరియు గ్రామానికి పేరు తెచ్చినందుకు అభినందనలు తెలియజేశారు... రూప శ్రీ సాధించిన ఈ ఘన విజయం అనేక మంది నిరుపేద విద్యార్థులకు ఆదర్శనీయం.

# కుషాయిగూడలో కరెంట్ షాక్ ప్రమాదం

## యువ ఎలక్ట్రీషన్ మృతి

**కుషాయిగూడ, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం దురదృష్టకర సంఘటన చోటు చేసుకుంది. పి. శివకుమార్ (వయసు 30), తండ్రి శంకర్, వృత్తి ఎలక్ట్రీషన్, గౌరెల్లి (గా), అబ్దుల్ పూర్ మెట (మం) ప్రాంతంలో ఉన్న నేషనల్ సౌండ్స్ & ఎలక్ట్రిక్, కుషాయిగూడలో పనిచేస్తుండగా, సాయంత్రం 4 గంటల సమయంలో వేంకటేశ్వర స్వామి ఆలయం పరిధిలో ఎలక్ట్రిక్ పనులు నిర్వహిస్తున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి క్రింద పడిపోయాడు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు శివకుమారిని దగ్గరలోని ఈసీఐఎల్ లో శ్రీకార రాఘవేంద్ర హాస్పిటల్, తరలించారు. డ్యూటీ వైద్యులు పరీక్షించిన తర్వాత అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. వైద్యులు, షార్ట్ "సిర్క్యూట్ లేదా అధిక వోల్టేజ్ కారణంగా కరెంట్ షాక్ తగిలినట్లే కనిపిస్తోంది" అని తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం, శివకుమార్ వృత్తి క్షేత్రంలో అనుభవం ఉన్నప్పటికీ, ప్రమాదం ఏకసారిగా చోటు చేసిందని తెలిపారు. క్షేమ స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లినా, తక్షణ చికిత్స సమర్థవంతంగా పనిచేయలేదు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. పోలీసులు, "ప్రమాద స్థలంలో సౌకర్యాలు, సేఫ్టీ పరికరాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలిస్తుంటాం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం తర్వలో వెల్లడించబడుతుంది" అని తెలిపారు.స్థానికులు, శివకుమార్ మృత్యువు కుటుంబానికి సంతాపం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వృత్తిపరులు, "క్రొత్త ఎలక్ట్రీషన్‌లు కూడా సేఫ్టీ నిబంధనలు పాటించాలి" అని సూచిస్తున్నారు.



# గణేష్‌నగర్ కాలనీలో శ్రమదానం చేసిన యువకులు

- రోడ్లలో గుంతలతో ప్రజలకు ఇబ్బందులు
- యూత్ స్వయంగా ముందుకు వచ్చి చెట్లు తొలగించి గుంతలు పూడ్చారు
- అధికారులు శాశ్వత మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

**జఫర్‌గడ్,అక్టోబర్3(తెలంగాణ ముచ్చట్లు):**

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో రోడ్లు సంవత్సరాలుగా గుంతలతో ఉండటంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ఎప్పటికీ పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులపై నిరసనగా స్థానిక యువకులు శుక్రవారం రాత్రి శ్రమదానం కార్యక్రమం చేపట్టారు.వారి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను డోజర్ సహాయంతో తొలగించారు. అలాగే రోడ్లపై ఉన్న గుంతలను సిమెంట్‌తో పూడ్చి చదును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అయినా ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు పట్టపూరి రజినికాంత్, కిరణ్, రఘు, పట్టపూరి కిరణ్‌కుమార్, శ్రీకాంత్, రజనీకాంత్, అఖిల్, కర్ణాటకకు చెందిన అనిల్, సునీల్, మాత్రాశి రాజు, సాకి రాము తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# గ్రామీణ ప్రజలకు వైద్య సౌకర్యం

- వెల్టూర్ లో అక్షయ ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించిన పెద్ద శ్రీనివాసరెడ్డి
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి

**పెద్దమందడి,అక్టోబర్2(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో చెన్నయ్య నూతనంగా ఏర్పాటు చేసిన అక్షయ ప్రథమ చికిత్స కేంద్రాన్ని గురువారం పెద్ద శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దమందడి మాజీ జడ్పీటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ ..గ్రామంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రథమ చికిత్స కేంద్రం ఎంత ఉపయోగపడుతుందని అన్నారు. వెల్టూర్ గ్రామంలో మెడికల్ షాప్ నిర్వాహకులు సమీప గ్రామాల ప్రజలకు ప్రథమ చికిత్స కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమని పేర్కొన్నారు.అక్షయ ప్రాథమిక చికిత్స కేంద్రం ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందుబాటులో ఉంటూ... నైపుణ్యం, అర్హత కలిగిన ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు.నిర్వాహకులు చెన్నయ్య ను జడ్పీటిసి రఘుపతి రెడ్డి, పెద్ద శ్రీనివాస్ రెడ్డి అభినందిస్తూ, సమాజానికి సేవలో అతని కృషి స్ఫూర్తిదాయకమని చెప్పారు. పెద్ద శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉండటం ద్వారా చిన్న రోగాలు, అత్యవసర పరిస్థితులు సమయానికి తగిన విధంగా చికిత్స పొందగలుగుతారని తెలిపారు. వైద్య సేవలను అందించడం ద్వారా సమాజానికి ప్రగతి, ప్రజా సంక్షేమం దిశగా పెద్ద అడుగు వేయబడిందని వివరించారు.అక్షయ ప్రథమ చికిత్స కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, యువత, పాల్గొన్నారు. ప్రజలకు ప్రాథమిక వైద్యసౌకర్యాలను చేరువ చేస్తూ, ఇది గ్రామీణ ఆరోగ్య పరిరక్షణకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.






# కాచిగూడ అనకాపల్లి రైలుకు మల్కాజ్ గిరిలో ఘన స్వాగతం

**మల్కాజ్‌గిరి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మహాత్మా గాంధీ జయంతి, దసరా పండుగ మరియు సౌత్ సెంట్రల్ రైల్వే 59వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 07055 కాచిగూడ అనకాపల్లి పండుగ ప్రత్యేక రైలుకు మల్కాజ్ గిరి ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఈ రైలు ప్రతి గురువారం సాయంత్రం 4:50 గంటలకు కాచిగూడ నుండి బయలుదేరి, మల్కాజ్ గిరి వద్ద సాయంత్రం 5:10 5:12 గంటల మధ్య ఆగి, మరుసటి రోజు ఉదయం 8:00 గంటలకు అనకాపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి సాయంత్రం 5:35 గంటలకు బయలుదేరి, మల్కాజ్ గిరి వద్ద 6:43 6:45 ఆగి, రాత్రి 9:00 గంటలకు కాచిగూడకు చేరుతుంది అని రైలు ప్రయాణికుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఏ.వి. స్వామి, కరీమా, పి. భరద్వాజ్, వహీదా, ధనుంజయ్, హసీనా, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొని, మల్కాజ్ గిరిలో హల్ట్ సౌకర్యం కల్పించినందుకు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మ మరియు ఇతర అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అదే సమయంలో, మల్కాజ్ గిరి వద్ద రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కూడా నిలపాలని పలువురు ప్రయాణికులు కోరారు.






# మహాత్ముని స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**ఆర్.పెద్ద శ్రీనివాస్ రెడ్డి, వెల్టూర్**

**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పెద్ద శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువత, సమూహంగా హాజరై బాపూజీకి నివాళులు అర్పించారు.మొదటగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గాంధీజీ స్వాతంత్ర్య పోరాటంలో అహింసా మార్గాన్ని ఎంచుకొని ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. సత్యం, అహింస, సమానత్వం, సేవాస్ఫూర్తి వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాల్సిన అవసరాన్ని వివరించారు. యువత గాంధీజీ ఆలోచనలను ప్రేరణగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించి బాపూజీ చూపిన "స్వచ్ఛతే సేవ" మార్గాన్ని స్మరించుకున్నారు. విద్యార్థులు గాంధీజీపై ప్రసంగాలు చేసి ఆయన జీవిత చరిత్రలోని సంఘటనలను వివరించారు.అలాగే గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, డి.రమేష్, రఘువర్ధన్ రెడ్డి, దిండు చంద్రశేఖర్ సాగర్, దిండు రవీందర్, ముష్టి శ్రీనివాసులు, బండి ప్రవీణ్ కుమార్, కావలి రాములు, మహమ్మద్ సాదిక్, షాబుద్దీన్, బిజెపి రమేష్, వడ్డే శేఖర్, పట్నం సత్తన్న, బుచ్చయ్య, మల్లికార్జున్, జిఎల్ అనంతరెడ్డి, అశోక్ (చిట్టి), నరేష్, మహేశ్వర్ రెడ్డి, జిఎల్ చంద్రశేఖర్ రెడ్డి, జిఎల్ శ్రీనివాస్ రెడ్డి, జిఎల్ బాల్ రెడ్డి, ఐ.ఆంజనేయులు, జి.శ్రీనివాస్ రెడ్డి, సత్య రెడ్డి, మిల్లర్ రాజు, చందు రెడ్డి, రుక్మదిన్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి బన్నాల ప్రవీణ్ విజయదశమి శుభాకాంక్షలు



**చిల్కానగర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సత్కరించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ – "కనకదుర్గ అమ్మవారి కటాక్షంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై, ధైర్యంగా, శక్తివంతంగా సేవ చేస్తూ ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాను. వారి కోరికలన్నీ అమ్మవారు నెరవేర్చాలని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు.



# కీర్యా తాండ పోచమ్మ పండుగలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మండలం అప్పాయి పల్లె కీర్యా తాండలో నిర్వహించిన పోచమ్మ పండుగ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.బాధ్య నాయక్ ఆహ్వానం మేరకు హాజరైన డాక్టర్ చిన్నారెడ్డి, తాండ రైతన్నలకు పసిడి సిరులు పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని దేవీదేవతలను ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, నందిమల్ల రాము, భాస్కర్తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జయగిరిలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**హసన్ పర్తి,అక్టోబర్ 03(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని జయగిరి గ్రామంలో దుర్గామాత అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామస్థుల సారథ్యంలో పది రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువత, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అలంకారాలు,కుంకుమార్చనలు,సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు అమ్మవారికి మహాపూజలు నిర్వహించగా, అనంతరం శోభాయాత్రతో ఉత్సవాలు ముగిశాయి.స్థానిక నాయకులు, పెద్దలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని దేవీ కృపకు పునీతులయ్యారు.గ్రామ ప్రజలు ఇలాంటి కార్యక్రమాలు సాంప్రదాయాన్ని కొనసాగించేలా ప్రోత్సాహం ఇస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

# డివిజన్ నాయకులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి దసరా శుభాకాంక్షలు



**నాచారం, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** విజయదశమి పండుగను పురస్కరించుకొని నాచారం డివిజన్ నాయకులు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని వారి కార్యాలయంలో కలిసి ఘనంగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎమ్మెల్యేను పండుగ సందర్భంలో ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజల సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలను గుర్తించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, విట్టల్ యాదవ్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్ దాసరి, కర్ణ వాసు, ఈశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాయకులు ఎమ్మెల్యేకి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం చేసే ప్రణాళికలు, భవిష్యత్ పథకాలు, సమాజంలో సానుకూల మార్పులు సాధించడానికి తీసుకునే చర్యలపై చర్చలు జరిపారు.ఈ కార్యక్రమం స్థానిక ప్రజల మరియు పార్టీ నాయకుల మధ్య సానుభూతి, ఆత్మీయతను మరింత బలోపేతం చేస్తూ, సమూహ రాజకీయ పరిసరాల్లో సమగ్ర సంబంధాలను మెరుగుపరిచినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

# శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యం లో మల్లాపూర్‌లో దసరా ఉత్సవాలు



**మల్లాపూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్‌లో శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ధార్మిక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత ప్రదర్శనలు, నాటకాలు జరిగాయి. కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవానికి విశేష వైభవాన్ని నింపారు. పాల్గొన్నవారు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని దసరా పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమం స్థానిక సమాజంలో సాంఘిక ఐక్యత ను పెంపొందించడంలో, సాంప్రదాయాలను కొనసాగించడంలో కీలక పాత్ర పోషించింది.



# దమ్మాయిగూడలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగింపు

**దమ్మాయిగూడ,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శివానందపూర్ కాలనీలో పదకొండు రోజులపాటు నిర్వహించిన శ్రీ కనకదుర్గాదేవి దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అమ్మవారి శోభాయమాన అలంకరణలు, శక్తి తాండవాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాలు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా సాగి విజయదశమి రోజున ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఆలయ కమిటీ చైర్మన్ సుప్రీత్ రెడ్డి (సినీనటుడు కాట్రాజ్), అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కమిటీ సభ్యుల సమిష్టి సహకారంతో వేడుకలు మరింత భక్తిపరంగా, ఆధ్యాత్మికంగా జరిగాయి.

విజయదశమి సందర్భంగా ఉరేగింపు, చక్రస్నానం, మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించగా, అనంతరం భక్తులందరికీ మహా ప్రాసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల ముగింపునకు వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆశీర్వాదాలను పొందారు.




# ప్రజల గుండెల్లో నిలిచినవాడే నిజమైన నాయకుడు

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,అక్టోబర్3(తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి పెబ్బేరు మండల బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నిత్యచైతన్యవంతులని, డబ్బు ప్రభావం కంటే సేవాభావమే ఎన్నికల్లో ప్రాధాన్యం సాధిస్తుందని స్పష్టం చేశారు.

"ప్రజల అభిప్రాయాన్ని గౌరవించే బాధ్యత నా దే, మీ అభ్యర్థిని మీరే నిర్ణయించండి" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయండి

◆ **బిజేపి రాష్ట్ర అధ్యక్షులకు నెల్లూరి వినతి**

**ఖమ్మం బ్యూరో, అక్టంబర్ 03, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం నుండి దేవరపల్లి వెళుతున్న గ్రీన్ఫీల్డ్ హైవే విషయంలో రైతులు పడుతున్న సమస్యలను బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపనేని రామచంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం నుండి దేవరపల్లి వరకు నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే వలన రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా వివరించారు. సత్తుపల్లి ఎగ్జిట్ వరకు సాగుతున్న ఈ హైవే నిర్మాణం భూములను రెండు ముక్కలుగా విభజించిందని, పొలాలకు వెళ్లే దారులు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ధాన్యం రవాణా వాహనాలకు దారి లేకపోవడంతో సాగు పనులు స్తంభించిపోతున్నాయని, చెరువులు-వాగులు-కాలువల క్రింద ఉన్న భూములకు చేరుకోవడమే కష్టసాధ్యమైందని నెల్లూరి వివరించారు. నాగార్జునసాగర్ కమాండ్ ఏరియాలో ఉన్న ఈ భూములు నీటిపారుదల ఆధారంగానే పంటలు పండిస్తాయని, కానీ సర్వీసు రోడ్లు లేకపోవడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగించడం కష్టమైందని చెప్పారు. హైవే కోసం రైతులు వ్యతిరేకం కాదని, కానీ వారి జీవనాధారాన్ని కాపాడే విధంగా వెంటనే ఇరువైపులా సర్వీసు రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సర్వీస్ రోడ్ నిర్మాణ విషయంలో జాతీయ నేతల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. అదే విధంగా వినతి పత్రాన్ని కేంద్ర రహదారులు, రవాణా & హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి లకు వినతి పత్రం పంపినారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బిజెపి నాయకులు బండారు నరేష్, యార్లగడ్డ రాఘవ రావు తదితరులు ఉన్నారు.





# గంగారం బెటాలియన్‌లో గాంధీజయంతి వేడుకలు

**సత్తుపల్లి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** బి.గంగారం గ్రామంలోని 15వ స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో గురువారం మహాత్మా గాంధీజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఎం.పెద్దబాబు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ కీలకపాత్ర వహించారని, ఆయనను దేశ ప్రజలు జాతిపితగా, మహాత్ముడిగా గౌరవిస్తున్నారని పేర్కొన్నారు. సత్యం, అహింస గాంధీజీ ఆచరణలో పెట్టిన ముఖ్య సిద్ధాంతాలని, సహాయనిరాకరణ, సత్యాగ్రహమే ఆయనకు ప్రధాన ఆయుధాలని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మహాత్ముని చూపిన మార్గంలో నడవాలని, ఆయన ఆశయాల సాధనకై కృషి చేయాలని కమాండెంట్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతి ఎస్.శ్రీధర్ రాజా, అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.





# కనకదుర్గ అమ్మవారిని దర్శించిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

**చిల్కానగర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా హబ్సిగూడ వేలుగుట్ట కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత ప్రవీణ్ మాట్లాడుతూ – "విజయదశమి అంటే చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీక. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాల తో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. తరువాత ఆలయ కమిటీ వ్యవస్థాపక సభ్యులు గౌరిగే మల్లేష్ కుటుంబ సభ్యులు కార్పొరేటర్ గీత ప్రవీణ్‌కు అమ్మవారి నవరాత్రి అలంకరణలో ఉపయోగించిన చీర, ప్రసాదాలను అందించి వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజలు

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ ఆకాంక్షించారు. గురువారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు కమిషనర్ ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ విజయాన్ని చేకూర్చే విజయదశమి పర్వదినాని పురస్కారించుకొని జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పోలీసుల గౌరవం, కీర్తిప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఆడ్మీన్) రామానుజం, అడిషనల్ డీసీపి(ఏఆర్) కుమారస్వామి, ఎస్బి ఎసిపి మహేష్, ఏ ఆర్ ఏ సి పి సుశీల్ సింగ్, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబ శివరావు, నాగుల్ మీరా, సిఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రామన్నపేట కాలనీలో అయ్యప్పలకు అన్నదానం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** నగరంలోని 60వ డివిజన్ రామన్నపేట కాలనీలో శుక్రవారం అయ్యప్పలు మాల ధారణ చేశారు. మాల ధారణ తొలి రోజు పురస్కరించుకుని రామన్నపేట కాలనీలోని బొమ్మ స్వామి గుడి లో గొలుసుల తిరుమలరావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఈ సందర్భంగా 1వ డివిజన్ కైకొండాయిగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగటి ఉపేందర్ ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అయ్యప్ప మాలధారణ అనేది భక్తి, నియమాలు, శుద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. భక్తులు స్వామి నియమాలు పాటించి విజయవంతంగా దైవ దర్శనానికి వెళ్లాలని ఆకాంక్షించారు



# ఈ నెల 5,6న తెలంగాణ శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సు

◆ **కీసరలో గోడపత్రిక ఆవిష్కరించిన సంస్థ ప్రతినిధులు**

**కీసర, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలు, ఉద్యోగ భద్రత అంశాలపై చర్చించేందుకు తెలంగాణ శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర 5వ సదస్సు అక్టోబర్ 5, 6న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని వినయ్ గార్డెన్స్‌లో జరగనుంది. ఈ సదస్సులో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం. రేవతి కళ్యాణి తెలిపారు. శుక్రవారం కీసరలో ఆమె సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర నలుమూలల నుండి వందలాది మహిళా ఉద్యమ నాయకులు, ప్రతినిధులు హాజరవుతారని, శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చలు జరుగుతాయని తెలిపారు.

సదస్సు ముఖ్యాంశాలు:

అక్టోబర్ 5: ఎస్‌పీఎం క్రికెట్ గ్రౌండ్ నుండి ఎస్‌బీఐ బ్యాంక్, రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో అఖిల భారత కార్మిక నాయకులు ప్రసంగించనున్నారు. ఈ సభకు సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్. త్రివేణి అధ్యక్షత వహించనున్నారు. జాతీయ కార్యదర్శి దీపా కె. రాజన్, జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.వి. రమ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు.

అక్టోబర్ 6: ప్రతినిధుల సమావేశంలో మహిళల సమస్యలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తారు. రాష్ట్ర నలుమూలల నుండి వందలాది మహిళా ప్రతినిధులు పాల్గొననుండగా, మేడ్చల్ జిల్లా నుండి విశేష సంఖ్యలో హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## పెట్రోలియం, సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా 'వద్దిరాజు' మరోసారి ఎన్నిక



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామక ప్రక్రియలో భాగంగా.. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరోసారి పెట్రోలియం మరియు సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు లోక్ సభ డిప్యూటీ సెకెరట్రి సుజయ్ కుమార్ శుక్రవారం నియామాక ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 31 మంది సభ్యులు గల ఈ కమిటీలో లోక్ సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతి రెండేళ్లకో సారి నియామాకం అయ్యే ఈ కమిటీకి రవిచంద్ర వరుసగా మూడోసారి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ దఫా పెట్రోలియం మరియు సహజ వాయువు స్టాండింగ్ కమిటీకి చైర్మన్ గా లోక్ సభ ఎంపీ సునీల్ దత్తాత్రేయ తట్కరే కొత్తగా ఎన్నికయ్యారు.

## లింగాలపల్లిలో రాష్ట్రస్థాయి పామాయిల్ రైతుల సమ్మేళనం

**మంత్రి తుమ్మలతో పాటు పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు**

**అశ్వారావుపేట, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం లోని లింగాలపల్లి గ్రామంలో నేడు (శనివారం) ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి పామాయిల్ రైతుల సమ్మేళనం జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పామాయిల్ సాగు జరుగుతున్న నియోజకవర్గాల శాసనసభ్యులు హాజరు కానున్నారు.

ఈ రాష్ట్రస్థాయి సమ్మేళనం ప్రధాన ఉద్దేశం తెలంగాణను పామాయిల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే. భవిష్యత్తులో 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా పామాయిల్ కనీస మద్దతు ధర, ఉత్పత్తి, క్రషింగ్, సాగు ప్రోత్సాహకాలు, రాయితీలు వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కార మార్గాలపై చర్చించడం జరుగనుంది.

ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ రైతులు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

# ఫలించిన మాజీ ఎంపీ నామ కృషి


## రాష్ట్రానికి నాలుగు కేంద్రీయ విద్యాలయాలు

**ప్రజల ఆశల సాకారం దిశగా మాజీ ఎంపీ నామ అడుగులు**

**రాష్ట్రంలో మాజీ ఎంపీ నామకు పలువురి కృతజ్ఞతలు**





**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 03, తెలంగాణ ముచ్చట్లు;** ఎట్టకేలకు మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు కృషి ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి నాలుగు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కావడంతో ఎంతోకాలంగా కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు కోసం మాజీ ఎంపీ నామా చేసిన పోరాటానికి ఫలితం దక్కినట్లు అయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలకు అభివృద్ధి ప్రాధాన్యం ఇస్తూ, కేంద్రీయ విద్యాలయాలను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు నిరంతర కృషి చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రం విభజన అనంతరం జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగిన తరువాత, విద్యారంగ అభివృద్ధికి కీలకంగా మారిన కేంద్రీయ విద్యాలయాల మంజూరులో నామ పాత్ర విశేషమైందనే చెప్పాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు ఎంపీగా గెలిచిన నామ తన నియోజకవర్గానికి, రాష్ట్రానికి అనేక కేంద్ర పథకాలను తీసుకురావడంలో కృషి చేశారు. మొదటి సారి ఎంపీగా గెలిచినప్పటి నుంచే కేవీ బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమస్యలు, విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కోసం ఆయన నిరంతర పోరాటం కొనసాగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత, కొత్త జిల్లాలు వచ్చిన నేపథ్యంలో 17వ లోక్‌సభలో అనేక సార్లు పార్లమెంట్ లో రాష్ట్రనికి రావాల్సిన పలు కీలకమైన ప్రాజెక్టులపై ప్రశ్నలు అడగటంతో పాటు, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రికి లేఖలు రాసి విజ్ఞప్తులు చేసి సమస్యను ఢిల్లీ దాకా తీసుకెళ్లారు. దీర్ఘకాలిక కృషి ఫలితంగా కేంద్రం ఇటీవల నాలుగు కొత్త కేంద్రీయ విద్యాలయాలను తెలంగాణకు మంజూరు చేసింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు - యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ కింద, ములుగు జిల్లా కేంద్రం లో , వనపర్తి జిల్లా - నాగవరం శివార్ లో , జగిత్యాల జిల్లా - చెల్గల్ లో నూతనంగా కేవీ లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కేవీ లు 35, కొత్తగా మంజూరైనవి 4తో వాటి సంఖ్య 39 కు చేరనున్నవి. దేశవ్యాప్తంగా 57 కొత్త కేవీ లు మంజూరైతే అందులో 20 ఇప్పటివరకు కేవీ లేని జిల్లాలుకు, 14 - ఆశావహ జిల్లాలు, 4 - ఎల్‌డబ్ల్యూఈ జిల్లాలు, 5 - ఈశాన్య రాష్ట్రాలు/పర్వత ప్రాంతాలు వున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేవీ మంజూరు కావడం ప్రత్యేక ప్రాధాన్యం కలిగింది. ఇది వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత స్థాయి పెంచడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ మరియు పారామిలటరీ దళాల సిబ్బంది, హెవీ వాటర్ ప్లాంట్, ఎన్ఎమ్‌డీసీ, సింగరేణి బొగ్గు గనుల కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే అవకాశం కల్పిస్తుంది. నామ కృషితో ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నవోదయ విద్యాలయం కూడా స్థాపించబడింది. ఇది స్థానిక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. విద్యా రంగానికి మాత్రమే కాకుండా ఖమ్మం జిల్లాకు శాశ్వత అభివృద్ధి తీసుకురావడంలో నామ పాత్ర విశేషమైంది. ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా, ప్రజల సమస్యలపై లోతుగా ఆలోచించి, కేంద్ర స్థాయిలో ఫలితాలను సాధించే విజన్ ఉన్న నాయకుడుగా నామ నిలుస్తున్నారు అనుటలో సందేహం లేదు. నామ కృషి ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం తో పాటు రాష్ట్రం లో మరో మూడు కేంద్రీయ విద్యాలయాల మంజూరుపై ప్రజలు, విద్యావంతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



## పండగ వేళ గుడ్‌న్యూస్ చెప్పనున్న కేంద్రం.. ఉద్యోగులకు డీఏ పెంపు..?

పండగ వేళ కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) సరవణ చేయనున్నట్లు తెలిసింది. నేడు ప్రధాని అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర మంత్రివర్గం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా తెలిపాయి. మంత్రివర్గం ఆమోదం తర్వాత సవరించిన డీఏ జులై 1 నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం లభించనుంది. కంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జులైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జులై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఈ ఏడాది మార్చిలో 2శాతం పెంచింది. దీంతో డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. ఇప్పుడు ఎంత మేర పెంచుతారన్నదానిపై క్లారిటీ లేదు. గతేడాది అక్టోబర్‌లో మాత్రం దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## బంగారం ధర మరింత పెరిగింది..



బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 17, 450కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 07, 660కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 17, 600కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 07, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 17, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 07, 660కి చేరింది (%Gశీశ్రీస జూతీఅషవ అఅ నవసవతీaపaస%). వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి.

## జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ దేవి నవరాత్రి ఉత్సవాలు



**చర్లపల్లి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ చర్లపల్లి డివిజన్, కుషాయిగూడ పరిధిలోని ఎంఆర్ఆర్ కాలనీలో నిర్వహించిన జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ దేవి నవరాత్రి ఉత్సవాలకు దసరా పండుగ రోజు శ్రీ రాజరాజేశ్వరి దేవి రూపంలో దర్శనం ఇచ్చిన దుర్గామాత . జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిషి చేతుల మీదుగా లక్కీ డ్రా తీయడం జరిగింది. లక్కీ డ్రా లో మొదట విజేతగా క్యాసని లతా మాధురి ఎలక్ట్రానిక్ స్కూటర్ విజేతగా గెలుపొందారు. రెండో విజేతగా మనీష్ మొబైల్ ఫోన్ గెలుపొందారు. యూత్ ఆర్గనైజర్ శకత్ విజయ్ కుమార్ చేతుల మీదగా విజేతలకు బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ అమ్మవారు అందరికీ సుఖ సంతోషాలతో ఆశీర్వాదం ఇవ్వాలని శ్రీ రాజరాజేశ్వరి దేవిని వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆర్గనైజర్ శకత్ విజయ్ కుమార్ మరియు కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, ఎస్. రాహుల్, యశ్వంత్, నాగేందర్, ఎస్. అరుణ్, కిషోర్, బాల, కే. ప్రసాద్, లింగం నాయక్,సంజయ్, దినేష్. భవాని దీక్ష మాలదారులు, అధిక సంఖ్యలో ప్రత్యేక అతిధులు పాల్గొన్నారు.

# పండుగల వేళ పెరిగిన గ్యాస్ ధర..

## కమర్షియల్ సిలిండర్‌పై రూ.15.50 వడ్డన..!




గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్టు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హోటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం.. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా.. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం తదితర అంశాల ఆధారంగా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తూ వస్తాయి. అయితే, మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం సామాన్యులపై పడకుండా ప్రభుత్వం గృహవినియోగ సిలిండర్ల ధరలను నియంత్రిస్తుంది. డొమెస్టిక్ గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుండడంతో జనాలకు ఊరట కలుగుతున్నది. అయితే, వాణిజ్య సిలిండర్ల ధరలను మాత్రం ప్రతినెలా మారుతుంటాయి. ఒక్కో సందర్భంలో ధరలు తగ్గుతుంటాయి. అయితే, గత సెప్టెంబర్‌లో ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హోటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ఇవన్నీ రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్‌పీజీపైనే ఆధారపడుతుంటాయి. సిలిండర్ ధర పెరగడంతో ఈ వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టేందుకు ధరలను పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.



# గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉండాలా..


ప్రెగ్నెన్సీ టైమ్ మహిళలకు సవాళ్లతో కూడుకున్నది. ఈ సమయంలో వారు తమను తాము మాత్రమే కాకుండా కడుపులో ఉన్న బిడ్డను కూడా చూసుకోవాలి. గర్భధారణ సమయంలో మహిళలు ఆహారపు అలవాట్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఆరోగ్య నిపుణులు ఎల్లప్పుడూ సలహా ఇస్తుంటారు. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా మహిళలు గర్భధారణ సమయంలో అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని చెబుతారు. గర్భిణీ స్త్రీలు తమ ఆహారంలో ఏది తింటే కడుపులో ఉన్న బిడ్డకు కూడా పోషకాహారం అందుతుందో నిపుణులు సూచిస్తుంటారు. మహిళలు తమ ఆహారంలో పండ్లు, కూరగాయలతో పాటు పప్పులను కూడా తీసుకోవచ్చు. దీంతో వారికి ప్రొటీన్‌తో పాటు అన్ని రకాల పోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు.

పెసరు పప్పు..: పప్పు ధాన్యాల్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. ఈ జాబితాలో పెసరు పప్పు కూడా ఉంది. గర్భధారణ సమయంలో స్త్రీ దీనిని తింటే ఆమె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. విశేషమేమిటంటే ఇందులో కొవ్వు తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల మలబద్ధకం సమస్యలు నయమవుతాయి.మసూర్ పప్పు: మసూర్ పప్పులో ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. శరీరంలో ఐరన్ లోపం ఉంటే రక్తహీనత ఏర్పడుతుంది. గర్భధారణ సమయంలో ఈ పప్పు తింటే రక్తహీనత రాదు. అందుకే మసూర్ పప్పును మీ డైట్ లో చేర్చుకోండి. కంది పప్పు..: గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి మీ డైట్ లో కందిపప్పును చేర్చండి. కందిపప్పులో ఫోలేట్ పుష్కలంగా లభిస్తుంది. ఇది అవసరమైన పోషకాలను అందిస్తుంది. గర్భధారణ సమయంలో మహిళలు తమ ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పప్పులను సరైన పరిమాణంలో ఆహారంలో చేర్చుకుంటే, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

# ఏ వైపు తిరిగి పడుకోవడం మంచిది



నిద్ర ఆరోగ్యానికి చాలా మంచిది. మానవ శరీరంలో నిద్ర అనేది కీలక పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి తప్పనిసరిగా ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి అంటారు వైద్యులు.అయితే కొంత మంది తమ వర్క్ బిజీ లైఫ్‌లో సరిగా నిద్రపోవడం లేదు. మరికొంత మంది మానసికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం వలన నిద్రపోవడం లేదు. ఇంకొంత మంది స్మార్ట్ ఫోన్‌కు బానిసై నిద్రకు భంగం కలిగిస్తున్నారు. కానీ సరైన సమయంలో నిద్రపోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే కొంత మందికి పడుకున్నాక అస్సలే నిద్ర పట్టదు. ఏ వైపు తిరిగి పడుకోవాలో కూడా తెలియదు. కాగా, దాని గురించే ఇప్పుడు తెలుసుకుందాం. ఏ వైపు తిరిగి పడుకోవడం వలన ఆరోగ్యం బాగుంటుంది. అలాగే త్వరగా నిద్రపడుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అంటున్నారు వైద్యులు. ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన జీర్ణక్రియ బాగుంటుందంట. ఎడమవైపు నిద్రిస్తున్నప్పుడు మీ కడుపు, ప్యాంక్రియాస్ యొక్క స్థానం మెరుగైన డ్రైనేజీని అనుమతిస్తుంది. ఇది యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ప్రస్తుతం చాలా మంది మహిళలు సంతానలేమి సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు ఎడమ వైపు తిరిగి పడుకోవడం చాలా మంచిదంట. అంతే కాకుండే వెన్ను నొప్పితో బాధపడేవారు ఎడమవైపు తిరిగి పడుకోవడం మరీ మంచిదంట. ఇలా ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన గుండె పనితీరు కూడా బాగుంటుంది అంటున్నారు నిపుణులు.మీ ఎడమ వైపున పడుకోవడం వల్ల మీ గుండె పై ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్త ప్రసరణను మెరుగుపడుతుంది. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే గుండె మీ శరీరానికి ఎడమవైపు ఉంటుంది, కాబట్టి మీ ఎడమ వైపున నిద్రపోవడం వల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



# ఈ లక్షణాలు వుండే జాగ్రత్త..!

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఇప్పుడు చాలా మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి.లక్షణాలు తెలుసుకొని వ్యాధిని గుర్తించేలోపే అది ప్రాణాల మీదకు వస్తుంది. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు వైద్యులు. మరీ ముఖ్యంగా ఇప్పుడున్న యూత్ ఎక్కువగా బయట ఫుడ్‌కు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మసాలా ఫుడ్ అతిగా తింటూ గ్యాస్ట్రిక్, ఆసిడీటి, క్యాన్సర్ లాంటి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాపకింద నీరులా ప్రవహిస్తుంది. రోజు రోజుకు వేల సంఖ్యలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. మన చుట్టూ రోజు కలిసి మెలసి తిరిగిన వారు కూడా క్యాన్సర్ వ్యాధి బారిన పడి దాని లక్షణాలు గుర్తించి, వ్యాధి అని కన్ఫామ్ చేసుకునేలోపే మరణిస్తున్న సంఘటనలు అనేకం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు చాలా జాగ్రత్తలు చెబుతున్నారు. ఇలాంటి చిన్న చిన్న లక్షణాలు కనిపించినా అస్సలే నెగ్లెట్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు.అవి ఏ లక్షణాలో ఇప్పుడు చూద్దాం. విపరీతమైన కడుపునొప్పి కడుపులోని క్యాన్సర్‌కు కారణం కావచ్చు అంటున్నారు వైద్యులు. అతిసారం, మలబద్ధకం, మలం నల్లగా వెళ్లడం, తరచూ తిన్న తర్వాత వాంతి కావడం, పొత్తికడుపు నొప్పి, వాపు రావడం, ఆకలి లేకపోవడం, అతిగా బరువు తగ్గడం, అలసట, వంటివి క్యాన్సర్‌కు కారణమయ్యే ఛాన్స్ ఉన్నదంట. అందువలన ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అస్సలే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.



# క్యారెట్ ఎక్కువ తీసుకుంటే నష్టాలివే?

క్యారెట్‌లు ఎక్కువ తిన్నా కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఎందుకంటే కొన్ని సహజ చక్కెరలు ఉంటాయి. స్వచ్ఛమైన క్యారెట్ రసంలో చక్కెర తక్కువగా ఉంటుంది. కానీ ప్రాసెస్ చేసిన రసాలలో తరచుగా సువాసన కోసం జోడిరచిన చక్కెరలు ఉంటాయి. దీనివల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్యలు తలెత్తుతాయి. అలాగే, చిన్న పిల్లలకు క్యారెట్ ఎక్కువగా పెట్టడం సురక్షితం కాదు, అందువల్ల చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే పిల్లలకు అందివ్వాలి.అలాగే జ్యూస్ చేసేటప్పుడు ఇందులో అత్యంత పోషకమైన ఫైబర్ మొత్తాన్ని కోల్పోతాము. అందువల్ల, క్యారెట్లను జ్యూస్ చేసుకుని తాగడం, తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఒకేలా ఉండవు. అందుకే క్యారెట్ జ్యూస్ తాగే బదులు క్యారెట్ ను సలాడ్ గా లేదా పచ్చిగానే తీసుకోవడం మంచిది.ప్రతి రోజూ క్యారెట్ తినడం అలవాటు చేసుకున్న వారిలో ఇరిటేషన్, నిద్రలేమి, నెర్వెస్ నెస్ మరియు వాటర్ బ్రాష్ వంటి నెగటివ్ ఎఫెక్ట్స్ ను ఎదుర్కుంటారు. క్యారెట్స్ ఎక్కువగా తినడం వల్ల క్యారెట్‌లోని బీటా కెరోటిన్, కెరోటినాయిడ్స్ వల్ల చర్మ రంగులో మార్పు వస్తుంది. ఎల్లో కలర్ నుండి ఆరెంజ్ కలర్ లోకి మారుతుంది. అరచేతులు, ముఖం, చేతులు, పాదాల రంగులో మార్పు కనిపిస్తుంది. జ్యూస్ సెంటర్లలో విక్రయించే వారి వద్ద రుచి ప్రధాన అంశం కాబట్టి, కృత్రిమ రుచులను యాడ్ చేస్తుంటారు. ఇది క్యారెట్ జ్యూస్ ప్రయోజనాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు.. అన్‌పాశ్చరైజ్డ్ జ్యూస్‌లలో చిన్నపిల్లలకు, గర్భిణీలకు లేదా రోగనిరోధక శక్తి లేనివారికి హాని కలిగించే బ్యాక్టీరియా ఉండవచ్చు.క్యారెట్ జ్యూస్‌ని ప్రాసెస్ చేయడానికి కొన్ని రసాయనాలు వాడుతుంటారు. అలాంటివి ఆరోగ్యకరమైన జ్యూస్ ప్రయోజనాన్ని దెబ్బతీస్తాయి.

# పదే పదే పొత్తికడుపులో నొప్పి వస్తుందా..!

పొత్తికడుపులో నొప్పి అనేది చాలా సహజం. అయితే ఇది కొన్నిసార్లు కామన్‌గా ఉండొచ్చు, కానీ ఇది అధికమైతే మన జీవితాన్ని అనేక సమస్యల్లోకి నెట్టేసే అవకాశం ఉన్నదంటున్నారు వైద్యులు. పొత్తికడుపు నొప్పి అనేది అనేక రకాల సమస్యల వలన వస్తుందంట. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 1. పొత్తి కడుపు నొప్పి అనేది క్యాన్సర్‌కు సంకేతం అంటున్నారు వైద్యులు. కొన్ని రకాల క్యాన్సర్స్ పొత్తికడుపులో నొప్పిని కలుగజేస్తాయంట. అందువలన ఈ నొప్పి అనేది పదే పదే రావడం, గంటల తరబడి నొప్పిగా ఉన్నట్లు అనిపిస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలంట.2. అపెండిక్స్ అనేది కామన్ సమస్య. పెద్ద పేగులో ఉండే చిన్న సన్ని గొట్టం ఎర్రబడినప్పుడు ఈ సమస్య వస్తుంది. అయితే ఈ అపెండిక్స్ సమస్య ఉన్నప్పుడు కూడా పొత్తికడుపులో నొప్పి వస్తుందంట.3. ప్రస్తుతం చాలా మంది యూత్, వృద్ధులను అధికంగా వేధిస్తున్న సమస్య మలబద్ధకం. ఈ సమస్య ఉన్నవారికి కూడా పొత్తి కడుపులో నొప్పి వస్తుందంట.4. గ్యాస్ , అసిడిటీ సమస్యలకు పొత్తికడుపు నొప్పి కూడా కారణం కావచ్చునంట.గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్ అని పిలిచే యాసిడ్ రిఫ్లక్స్, కడుపు ఆమ్లాలు మీ గొంతును, కడుపుతో కలిపే భాగంలోకి వచ్చినప్పుడు వస్తుంది. దీని కారణంగా ఛాతీ, గొంతులో మంటగా అనిపిస్తుంది. 5. అలాగే కొంత మంది మహిళల్లో గర్భాశయ సమస్యలు, నీటి బుడగలు లాంటివి ఉండటం, పీసీఓడీ లాంటి సమస్యలు ఉన్నవారిలో కూడా పొత్తికడుపులో నొప్పివస్తుందంట.






## చూడడానికి చిన్న కాయ అయినా..

# పోషకాలలో మాత్రం మిన్న..!

సీజన్ లతో సంబంధం లేకుండా ప్రతి సీజన్‌లోనూ దొరికే కూరగాయల్లో దొండకాయ ఒకటి.దొండకాయను రకరకాల కూరలు ఉపయోగిస్తుంటారు.కానీ కొందరు మాత్రం దొండకాయను తినడానికి అస్సలు ఇష్టపడరు.కానీ దొండకాయలని సుగుణాలు తెలిస్తే అసలు అలా చేయలేరు.ఎందుకంటే మరెన్నో అనారోగ్య సమస్యలను సైతం దూరం చేస్తుంది. అస్సలు దొండకాయ తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చో ఇప్పుడు మనము తెలుసుకుందాం పదండీ..ఈ మధ్యకాలంలో ప్రతి పది మందిలోనూ ఆరు మంది డయాబెటిస్తో బాధపడుతూ ఉన్నారు అలాంటి వారు దొండకాయ తింటే చాలా మంచిదని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.ఎందుకంటే,రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్ ని తగ్గించడంలో దొండకాయ అద్భుతంగా పనిచేస్తుంది.వీరు వారానికి రెండు సార్లనా దొండకాయను వారి ఆహారంలో చేసుకోవడం ఉత్తమం.ఇలా తరచూ దొండకాయలు తీసుకోవడం వల్ల ఇందులో అధికంగా ఉన్న క్యాల్షియమ్, మెగ్నీషియమ్ వంటి పోషకాలు పుష్కళంగా అంది,ఎముకలు, దంతాలు దృఢంగా మారతాయి. మరియు ఇందులో ఉన్న ఆంటీ బ్యాక్టీరియాల్ గుణాలు, విటమిన్ సి మన శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచుతాయి.ఎందుకంటే మనం శరీరంలో రోగనిరోధక శక్తి ఉంటేనే కరోనా వైరస్ మరియు మామూలు సీజనల్ రోగాలకు దూరంగా ఉండవచ్చు.ఈ కాయలను ఫైబర్ కూడా అధికంగా లభిస్తుంది.కావున దొండకాయను తరుచూ తీసుకోవడంతో జీర్ణ సమస్యలు నయం అవ్వడంతో పాటు, మలబద్ధకం ,గ్యాస్, అజీర్తి వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.ఇందులో ఉండే అధిక పొటాషియం వల్ల రక్త ప్రసరణ సక్రమంగా జరిగి,గుండె ఆరోగ్యం మెరుగ్గా తయారవుతుంది.బరువు తగ్గాలనుకునే వారు ఇది మంచి ఆహారమని చెప్పవచ్చు.అదికాక శరీరంలో ఉన్న చెడు కొవ్వు కరుగుతుంది.

# రాత్రిపూట డిన్నర్ మానేస్తున్నారా..



ఈ మధ్యకాలంలో బిజీ లైఫ్ స్టైల్ లేదా ఇతర సమస్యల వల్ల బరువు పెరగడం లేదా ఊబకాయం బారిన ఎక్కువగా పడుతున్నారు. అధిక బరువు పెరగడం వల్ల మన శరీరం వ్యాధులకు నిలయంగా మారుతుంది. ఊబకాయం కారణంగా మధుమేహం, హైబీపీ, కొలెస్ట్రాల్ వంటి అనేక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కొంతమంది ఊబకాయాన్ని సాధారణ సమస్యగా భావిస్తారు. మరి కొంతమంది మాత్రం ఈ సమస్య నుంచి బయటపడేందుకు చూస్తుంటారు. దానికోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కొన్ని ప్రయత్నాలతో బరువు తగ్గినా భవిష్యత్తులో వారికి సమస్యగా మారుతుంది. అలాంటి ప్రయత్నాల్లో రాత్రి పూట భోజనం చేయకపోవడం కూడా ఒకటి. బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం మానేస్తారు. దీని కారణంగా శరీరంలో పోషకాల లోపం ఉంటుంది. రాత్రిపూట భోజనం మానేయడం వలన అనేక సమస్యలు ఎదురవుతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆ సమస్యలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.ప్రజలు రాత్రి పూట ఆహారం తీసుకోకపోవడం ఆరోగ్యానికి మంచిదని భావించినా దాని వల్ల అనేక నష్టాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు డైటీషియన్లు. అధిక బరువుతో బాధపడుతున్నవారు కొన్ని నెలల పాటు రాత్రి భోజనం చేయకుండా ఉంటే చాలని, సంవత్సరాల తరబడి దీనిని అనుసరించాల్సిన అవసరం లేదంటున్నారు. ఎక్కువ కాలం రాత్రి పూట ఆహారం మానేయడం వల్ల శరీరంలో పోషకాల లోపం కూడా ఏర్పడుతుంది. కొంత మంది మధ్యాహ్న భోజనంలో భారీగా తింటుంటారు. ఇలా చేయడం వల్ల శరీరంలో కార్బోహైడ్రేట్ల సంఖ్య పెరుగుతుంది. అలా కాకుండా కొంచం కొంచంగా ఎక్కువ సార్లు తింటే క్యాలరీల కౌంట్‌ను బ్యాలెన్స్ చేయగలుగుతారని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా కేలరీలు తీసుకోవడం తగ్గించి ప్రొటీన్లు, పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని నిత్యం తీసుకోవాలని చెబుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మంచి విజయం అందుకున్న కాంతార చాప్టర్1




రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' సినిమా గాంధీ జయంతి (అక్టోబర్ 2) సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదలై అంచనాలకు తగ్గట్టుగానే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. హోంబలే ఫిల్మ్స్‌పై విజయ్ కిరంగదూర్ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ చిత్రం, గతంలో వచ్చిన 'కాంతారకి ప్రీక్వెల్‌గా రూపొందింది. కాంతార చిత్రం సెన్సేషన్ క్రియేట్ చేయడంతో ప్రీక్వెల్ కూడా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో స్పెషల్ క్రేజ్ సంపాదించుకుంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'కాంతార చాప్టర్ 1' వరల్డ్ వైడ్‌గా దాదాపు 440 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనడంతో, తెలుగు థియేట్రికల్ రైట్స్ నైజాం: ?40 కోట్లు, ఆంధ్ర: ?45 కోట్లు, సీడెడ్: 15 కోట్లు బిజినెస్ జరిగినట్టు సమాచారం. ఈ ప్రీ రిలీజ్ బిజినెస్ ఆధారంగా, తెలుగు రాష్ట్రాల్లో బ్రేక్ ఈవెన్ టార్గెట్ ?101 కోట్ల షేర్ లేదా ?202 కోట్ల గ్రాస్ అని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సినిమాకు వరల్డ్ వైడ్‌గా పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా ?43.87 కోట్ల వసూళ్లు వచ్చాయి. ఇక మూవీ తొలి రోజు కలెక్షన్ల విషయానికి వస్తే.. హిందీ: ?22 కోట్లు, కర్ణాటక: ?15 కోట్లు, తమిళం మలయాళం: ?6 కోట్లు, ఓవర్సీస్: ?10 కోట్లు.. మొత్తంగా డే1 గ్రాస్: దాదాపు ?90 కోట్లు (అంచనా) . తెలుగులో కాంతారకు మంచి ఆదరణ లభించింది. పెయిడ్ ప్రీమియర్స్‌తో కలిపి ఆంధ్ర నైజాంలలో ?12 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. వీకెండ్‌లో ఇంకా ఎక్కువ వసూళ్లు నమోదయ్యే అవకాశం ఈ చిత్రంలో రిషబ్ శెట్టికి జోడీగా రుక్మిణి వసంత్ నటించగా, జయరామ్, గుల్షన్ దేవయ్య, ప్రమోద్ శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు. అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు. ఓవర్సీస్‌లో కూడా కాంతార చాప్టర్ 1 చిత్రం సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ అమెరికాలో ప్రీమియర్స్‌తో కలిపి 750 (భారత కరెన్సీలో 6 కోట్ల రూపాయలు) రాబట్టినట్టు సమాచారం.. ఇక న్యూజిలాండ్, యూకే, యూరప్, ఆస్ట్రేలియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ తదితర దేశాలో కాంతార చాప్టర్ 1కు 3 కోట్ల రూపాయల కలెక్షన్స్ వచ్చినట్లుగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా కాంతారకు ఓవర్సీస్‌లో తొలి రోజు 10 కోట్ల రూపాయల గ్రాస్ వచ్చిందని అంటున్నారు.




# మన శంకర వర ప్రసాద్ గారు' ఫస్ట్ సింగల్ ప్రోమో అవుట్

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి హైదరాబాద్‌లో 'మన శంకర వర ప్రసాద్' గారు సినిమాని చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి అనిల్ రవిపుడి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం యొక్క ఆడియో రైట్స్ ని టి సిరీస్ సొంతం చేసుకుంది. తాజాగా మూవీ మేకర్స్ ఈ సినిమా యొక్క ఫస్ట్ సింగల్ ప్రోమోని మీసాల పిల్ల అనే టైటిల్ తో విడుదల చేసారు. ఈ సాంగ్ కి ఉదిత్ నారాయణ తన గాత్రాణి అందించారు. నయనతార మహిళా ప్రధాన పాత్రలో నటిస్తుండగా, వెంకటేష్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. భీమ్స్ సెసిరోలియో ఈ చిత్రానికి సంగీత స్వరకర్తగా ఉన్నారు. సుష్మిత కొణిదెల యొక్క గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సహకారంతో బిగ్గిని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో సాహు గారపాటి నిర్మిస్తున్నారు మరియు సమర్పించారు.

# అన్ని వర్గాలనూ అలరిస్తుంది



ఈటీవీ విన్‌తో కలిసి నైన్టీస్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ హైదరాబాద్‌లో జరిగిన పూజా వేడుకతో తమ తొలి ప్రొడక్షన్‌ని లాంచ్ చేసింది. నిర్మాత రవిశంకర్ (మైత్రి మూవీ మేకర్స్) కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టారు, నిర్మాత ఎస్‌కేఎన్ ముహూర్తపు సన్నివేశానికి దర్శకత్వం వహించారు. బన్నీ వాస్, మెహర్ రమేష్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై, చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ అందించారు. వినోద్ గాలి దర్శకత్వంలో నైన్టీస్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మించిన ఈ ప్రాజెక్ట్ బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఇది అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. విరాజ్ అశ్విన్, ప్రియ దర్శిని రామ్, బాబు మోహన్, యశశ్రీరావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన దర్శకత్వం: వినోద్ గాలి, నిర్మాత: శరత్ చంద్ర నాయుడు, ఈటీవీ విన్ టీమ్: సాయి కృష్ణ కోయిన్ని, నితిన్ చక్రవర్తి, ప్రమదేష్ వి, సహ నిర్మాత: మనీష్‌పల్లె, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: రెహాన్ షేక్, ఎడిటర్: వెంకటేష్ చుండూరు, సంగీతం: సుహాస్, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, డైలాగ్ రైటర్: రాజశేఖర్ బద్దం, కొరియోగ్రాఫర్: ఈశ్వర్ పెంటి.



# "కొత్త ప్రయాణం" అంటూ పోస్ట్..

దసరా పండగ సందర్భంగా తన అభిమానులకు ఓ స్పెషల్ అప్డేట్‌ను ఇచ్చింది సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు. "కొత్త ప్రయాణం" అంటూ సోషల్ మీడియాలో ఓ ఫోటోను షేర్ చేసిన ఆమె, మళ్లీ ఒక్కసారిగా ఫ్యాన్స్‌లో, నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తించారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి వార్తలు మీడియాలో హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో, "కొత్త ప్రయాణం" అనే మాట మరింత చర్చనీయాంశంగా మారింది. అయితే సమంత పోస్ట్ చేసిన "కొత్త ప్రయాణం" అనే విషయం పెళ్లికి సంబంధించినది కాదు. కొత్త ఇంటికి షిఫ్ట్ అయిన క్రమంలో ఈ కామెంట్ చేసింది. ఇక కొత్త ఇంటి ఫోటోను ఆమె స్వయంగా షేర్ చేసింది. ఇంటి గోడపై అనే లోగోను స్టైలిష్‌గా ఏర్పాటు చేయగా, అదే ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.
అయితే ఇది హైదరాబాద్‌లోని ? లేక ముంబయిలోనా? అన్నది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు, సమంత మధ్య గత కొంతకాలంగా సన్నిహిత సంబంధం ఉందని ప్రచారం సాగుతోంది. వీరిద్దరూ 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్' సిరీస్‌ల్లో కలిసి పని చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి పలు ఈవెంట్లకు హాజరై మీడియా కంట పడుతున్నారు. దీంతో సమంత త్వరలో రెండో వివాహం చేసుకోనుందన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఆమె కొత్త ఇంటికి షిఫ్ట్ కావడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చినట్లైంది. అయితే దీనిపై సమంత నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.
ఇక సినిమాల పరంగా చూస్తే, సమంత ప్రస్తుతం రెండు ప్రాజెక్టులపై పని చేస్తోంది. ఒక్కటి పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న "రక్త్ బ్రహ్మాండ: ది బ్లడీ కింగ్‌డమ్", మరొకటి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కుతున్న "మా ఇంటి బంగారం". ప్రస్తుతం ఈ రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అభిమానులు చాలా కాలంగా సమంతను పెద్ద తెరపై మళ్లీ చూడాలనుకుంటుండగా, ఈ సినిమాల విడుదల కోసం ఆసక్తిగా దురుచూస్తున్నారు. "కొత్త ఇంటి లోగోతో, కొత్త జీవితం వైపు అడుగులు వేస్తున్న సామ్.. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిరచనున్నారా?" అనే ఉత్కంఠతో ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

# తగ్గేదేలే అంటున్న దీపికా పదుకొనే..



బాలీవుడ్ నటి దీపికా పదుకొనే సినిమా అప్‌డేట్స్ కన్నా ఎక్కువగా వివాదాలతోనే వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల కాలంలో వరుసగా దక్షిణాది చిత్రాలైన స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టుల నుంచి ఆమె తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పాటు, బాలీవుడ్‌లోనూ దీపికా డిమాండ్స్, ముఖ్యంగా వర్కింగ్ అవర్స్, సెట్‌లో సౌకర్యాల విషయంలో ఆమె షరతులపై తీవ్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. స్పిరిట్ సినిమాకు దీపికా నో చెప్పిన సందర్భంలో, ఆమె భారీ డిమాండ్స్ కారణంగానే దర్శకుడు సందీప్ ఆమెను పక్కన పెట్టేసారనే ప్రచారం జాతీయ స్థాయిలో జరిగింది. అనంతరం కల్కి 2 నుంచి కూడా దీపికా తప్పుకోవడంతో ఆమె తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in